# ఖులా

ఆరేళ్ళ నాజియా ఆడుకోడానికి బైటికెళ్తానన్నప్పుడు ఫాతిమా సరేననలేదు... అలాగని కాదననూలేదు. శూన్యంలోకి చూస్తున్నట్లు కూతురివైపు చూసింది. అల్లాని అనంత దయామయుడని కదా అంటారు... మరి నా జీవితంతో ఇలా ఆడుకుంటున్నాడేమిటి? యింత ఘోరమైన బద్ నసీబ్‌లు కూడా ఉంటాయా? అని ఆలోచిస్తోంది ఫాతిమా. అమ్మనించి సమాధానం కోసం ఎదురుచూసి, రాకపోయేసరికి "దస్ లహజోం మే ఆతీ మా" అంటూ వీధిలోకి పరుగెత్తింది నాజియా.

ఆ మాటలకి నవ్వొచ్చింది ఫాతిమాకి. ఎవరికైనా బైటి పని చెప్తే "దస్ లహజోం మే ఆనా" అనటం ఫాతిమాకి అలవాటు. తన కూతురు అవే మాటల్ని చిలుక పలుకుల్లా అప్పగించేప్పటికి అంత దుఃఖంలోనూ ఆమె పెదవుల మీద సన్నటి నవ్వు తెర పర్చుకుంది.

నాజియా ఆమెకు నాలుగో సంతానం.

ఫాతిమాకు పదిహేనేళ్ళకే ఫకీర్‌తో నిఖా జరిగింది. పుట్టిన పిల్లలు అర్థాంతరంగా చచ్చిపోతున్నారని వాళ్ళమ్మానాన్న ఫకీర్ అని పేరు పెట్టి ఉంటారనుకుంది కాని పెళ్ళయ్యాగ్గాని ఆమెకు తెలీలేదు అతను నిజంగానే దిక్కూదివాణం లేని ఫకీరని. వూరి చివర ఓ గోనె సంచి పర్చుకుని కూచుని, సైకిళ్ళకు పంక్చర్లేసే పని చేస్తుంటాడు. ఓ రోజు తింటే రెండ్రోజులు పస్తులుండే పరిస్థితి. నా నసీబ్‌లో యింతే రాసుంది అనుకుని సమాధాన పడింది ఫాతిమా.

పెళ్ళయిన రెణ్ణెల్లకే కడుపు... నాకు కొడుకే కావాలని ముందే ఖరాఖండిగా చెప్పాడు ఫకీర్. 'నా చేతిలో ఏముంది? అంతా అల్లా ఇష్టం' అనుకుంది ఫాతిమా. 'నా భర్త దుర్మార్గుడని అల్లాకి తెలీదా... ఏ కారణం లేకుండానే తాగొచ్చి,

పక్కటెముకలు విరిగిపోయేలా చావగొట్టే మగాడు, తన ఇష్టానికి విరుద్ధంగా ఆడపిల్లని కంటే బతకనిస్తాడా? అల్లా నాకు మగపిల్లాడినే ప్రసాదిస్తాడు' అనుకొని మనసుని శాంత పర్చుకుంది. ప్రతి నమాజ్‌లో మగపిల్లాడే కావాలని దువా చేసింది. ఫాతిమాకి మొదటి కాన్పులో ఆడపిల్ల పుట్టింది.

ఫకీర్ నానా రభసా చేశాడు. నాల్రోజులు యింటికి రాకుండా గడిపాడు. వడ్ల గింజ గొంతులో పోసి చంపేయమన్నాడు. లేకపోతే తనే గొంతు పిసికి చంపేస్తానన్నాడు. ఫాతిమా కాళ్ళు గడ్డాలు పట్టుకుని బతిమాలుకుంది. నాలుగిళ్ళలో పాచిపని చేస్కోనైనా కూతుర్ని పోషించుకుంటానంది. అతను కసితీరా కొట్టిన దెబ్బల్ని భరించింది. తిట్లని సహించింది. కోడి పెట్ట తన పిల్లని రెక్కల కింద దాచుకుని కాపాడినట్లు తన కూతుర్ని కాపాడుకుంది.

కూతుర్ని చంపేస్తే బావుండన్న ఆలోచనని అయిష్టంగానే విరమించుకున్నాడు ఫకీర్. కానీ ఆ పిల్లని చూసిన ప్రతి క్షణం విసుక్కోవటం, తిట్టటం మాత్రం మానలేదు.

ఫాతిమాకి వరసగా యిద్దరు మగపిల్లలు పుట్టారు. నాలుగేళ్ళ విరామం తర్వాత మరలా కడుపొచ్చింది. మూడో కొడుకు పుడ్తాడని, కూలినాలి చేసైనా సరే కాసిని డబ్బులు సంపాయించుకొస్తాడని ఆశపడిన ఫకీర్‌ని అనంతమైన నిరాశలోకి నెట్టేస్తూ కూతురు పుట్టింది. పుత్తడి బొమ్మలా ఉన్న కూతుర్ని చూసుకుని ఫాతిమా మురిసిపోయింది. ఫకీర్ తాగకుండానే చిందులేశాడు. పిచ్చి పట్టినోడిలా రంకెలేశాడు.

'నీకు తెలీకుండా ఏదో రోజు దీన్ని తీస్కెళ్ళి బజార్లో అమ్మేస్తా'నన్నాడు. 'దాని కెట్లా నిఖా చేయాలా పరవర్‌దిగార్ అని లోపల్లోపల కుమిలి పోతుంటే మరో దాన్ని తెచ్చి నా గుండెల మీద అలావా పెట్టావా' అంటూ కుడి కాలితో ఫాతిమా డొక్కలో తన్నాడు. 'ఈ రోజే నీకు తలాక్ యిచ్చేస్తున్నాను. దిక్కున్న చోట చెప్పుకుంటావో, బిచ్చమెత్తుకుని నీ యిద్దరు కూతుర్లని పోషించుకుంటావో నీ యిష్టం. మగ పిల్లలిద్దరూ నా దగ్గరే ఉంటారు' అంటూ బాలింతరాలని

కూడా చూడకుండా పెద్దకూతురితో సహా బైటికి గెంటేశాడు.

రెండ్రోజులు నిద్రాహారాలు లేక ఆరుబైట అల్లాడిపోయింది ఫాతిమా. వూళ్లో వాళ్ళు సర్ది చెప్పాక, పెద్ద మనుషుల బలవంతం మీద వాళ్ళని యింట్లోకి రానిచ్చాడు.

నాజియా... ఎంతందమైన రూపమో... బంగారు మేని ఛాయ... బాదం కాయల్లాంటి కళ్ళు... లక్కపిడతలాంటి నోరు... చిన్ని చుబుకం... గులాబీ రెక్కల్లాంటి బుగ్గలు.. స్వర్గానుభూతిని కలిగించే అద్భుతమైన నవ్వు....

'నాజియా వెళ్ళి గంట పైగా దాటింది. యింకా యింటికి తిరిగి రాలేదేమిటి?' అని ఆలోచించింది ఫాతిమా. సాయంత్రం ఆరు కావస్తోంది. మరి కొద్దిసేపు ఆడుకోనీ... యింకా చీకటి పడలేదుగా అనుకొని వంట పనిలో నిమగ్నమైపోయింది.

★ ★ ★

ఆడుకుంటున్న పిల్లల్ని కొద్ది దూరంలో నిలబడి గమనిస్తున్నాడు సునీల్. వాడికి పధ్నాలుగేళ్ళుంటాయి. నాన్న మోతుబరి. పదెకరాల మాగాణికి ఆసామి. ఆ వూరి సర్పంచూ, అతనూ ఒకే కులస్థులు. దూరపు చుట్టరికం కూడా ఉందని చెప్పుకొంటుంటాడు. తద్వారా వచ్చిన పలుకుబడిని తనకనుకూలంగా మల్చుకోవటంలో దిట్ట.

సునీల్‌కి చదువబ్బలేదు. దురలవాట్లు బాగా అబ్బాయి. గంటకు పది రూపాయలు ఖర్చు చేసి ఆ వూరిలో ఉన్న ఒకేఒక యింటర్నెట్ సెంటర్లో చూపించే బూతుబొమ్మలు చూడటం వాడి ప్రధానమైన వ్యాపకం.

ముగ్గురు మగపిల్లలు... యిద్దరు ఆడపిల్లలు ఆడుకుంటున్నారు. ఆ రెండో పిల్ల నాజియా కంటే చిన్నది. అంతందంగా కూడా లేదు. సునీల్ దృష్టి నాజియా మీద కేంద్రీకృతమైంది.

జాంపండులాంటి శరీర ఛాయ... అందమైన మొహం... సునీల్ కళ్ళ ముందు

యింటర్నెట్‌లో చూసిన దృశ్యాలు కదుల్తున్నాయి. ఎట్లాగయినా ఆ కోరిక తీర్చుకోవాలన్న తపన... వాడిలోని రాక్షసుడు కోరలు సాచి, జడలు విప్పుకుంటున్నాడు... యింటర్నెట్‌లోని అమ్మాయిలు బట్టలు విప్పుకున్నట్టు...

ఎగురుతున్న సీతాకోకచిలుకని పట్టుకునే ప్రయత్నంలో ఉంది నాజియా. దగ్గరదాకా వెళ్ళే వరకు అక్కడే ఉన్న సీతాకోకచిలుక తీరా పట్టుకోబోయేసరికి ఎగిరిపోతోంది.

"మా తోటలో బోల్డు సీతాకోక చిలుకలుంటాయి. నాతో వస్తే పట్టిస్తాను" అన్నాడు సునీల్.

నాజియా తన వెడల్పాటి కళ్ళతో వాడి వైపు చూసి "నిజంగా?" అంది.

"నిజం. తూనీగలు కూడా దొరుకుతాయి. వాటి తోకలకు దారం కట్టి ఆడుకోవచ్చు"

నాజియా కొద్దిసేపు ఆలోచించింది. "దూరమా?"

"దగ్గిరే... చెరువు గట్టున తోటల్లేవూ... అక్కడే"

నాజియా తను పట్టుకోవాలనుకున్న సీతాకోక చిలుకవైపు చూసింది. దాని రెక్కలకు అందమైన రంగులున్నాయి... చాలా అందమైన రంగులు... చాలా విశాలమైన రెక్కలు...

"నాకు ఈ సీతాకోక చిలుకే కావాలి" అంటూ వేగంగా దాని వెనక పరుగెత్తింది.

సునీల్‌కి మొదట ఏం చేయాలో అర్థం కాలేదు. ఎట్లాగయినా సరే ఆ పిల్లని మభ్య పెట్టి పిల్చుకెళ్ళాలనుకున్నాడు. నాజియా దగ్గరకు వెళ్ళి, "మా తోటలో జాంకాయలు కోసిస్తా. నీకు చాక్లెట్లు కొనిస్తా" అన్నాడు.

చాక్లెట్లనంగానే నాజియా ఆగిపోయింది. "నిజంగా... ఎన్ని?"

"నీకెన్ని కావాలంటే అన్ని" తన పాచిక పారినందుకు లోలోపలే సంతోషిస్తూ అన్నాడు.

నాజియా ఓ క్షణం ఆలోచించి "నాలుగు" అంది. సరేనన్నాడు. నాజియా

ఉత్సాహంగా అతని వెంట నడిచింది.

★ ★ ★

నాజియాకి స్పృహ తప్పింది. వళ్ళంతా రక్తం... అంత రక్తం చూడగానే సునీల్‌కి భయమేసింది. ఏం చేయాలో తోచలేదు. యిలా జరుగుతుందని వూహించలేదు. తను చూసిన యింటర్నెట్ చిత్రాల్లో ఎక్కడా యిలా జరగలేదు. వూళ్లో వాళ్ళకి తెలిస్తే చంపేస్తారన్న వూహకే వాడు వణికిపోయాడు. ఆ అమ్మాయి స్పృహలోకొస్తే వాళ్ళింట్లో వాళ్ళకి చెప్పడం ఖాయం. అలా జరక్కుండా ఉండాలంటే వాడికొక్కటే పరిష్కార మార్గం కన్పించింది. ఆ అమ్మాయిని చంపేయడం...

ఎలాగూ స్పృహలో లేదు కాబట్టి పక్కనున్న చెరువులోకి విసిరేస్తే చాలు. చచ్చిపోతుంది.

నాజియాని చేతుల్లో ఎత్తుకుని చెరువులోపలకి మోకాళ్ళలోతు వరకూ వెళ్ళి, బలంగా విసిరేశాడు. చేతికంటిన రక్తాన్ని నీళ్ళతో కడుక్కున్నాడు. మొహం మీద చల్లటి నీళ్ళు చల్లుకున్నాడు.

కొద్దిగా మనసు కుదుట పడింది. ఏమీ ఎరగనట్లే యింటికెళ్ళిపోయాడు.

★ ★ ★

ఏడు గంటలు దాటినా నాజియా యింటికి రాకపోయేసరికి ఫాతిమాలో కంగారు ఎక్కువైంది.

బాగా చీకటి పడింది. బైటికొచ్చి వాకబు చేసింది. తనతోపాటు ఆడుకున్న మిగతా పిల్లలు ఇళ్ళకు చేరుకున్నారు. నాజియా గురించి అడిగితే ఎవరో అబ్బాయితో వెళ్ళిందని చెప్పారు.

ఫాతిమాకు భయమేసింది. ఎవరా అబ్బాయి? తమ బంధువలబ్బాయా? అలాగయితే యింటికొచ్చి చెప్పకుండా అట్నుంచటే ఎందుకు పిల్చుకెళ్తాడు? ఐనా తమకు బంధువులెవరున్నారు? ఆకలీ అనారోగ్యాలు తప్ప...

ఫకీరే ఎవరిద్వారానో పిల్లని పిలిపించుకుని, తీస్కెళ్ళి అమ్మేశాడేమోనన్న అనుమానం బలపడే కొద్దీ ఆమె చిగురుటాకులా వణికిపోయింది. భర్త కోసం కబురెట్టిన అరగంటకు బాగా తాగి తూలుకుంటూ వచ్చాడు ఫకీర్.

"నాజియా కన్పించడం లేదండి" అంది ఏడుస్తూ.

"పీడా పోయింది. దాన్ని ఎలా వదిలించుకోవాలా అని చూస్తున్నాను. యిప్పుడు సంతోషంగా ఉంది" అన్నాడు ముద్దముద్దగా.

"అసలు నువ్వే ఏమైనా చేశావేమో?"

"నేనా? నేనేం చేశాను?"

"డబ్బుకాశపడి నా కూతుర్ని అమ్మేసి ఉంటావు"

ఆ మాటకు తాగిన మత్తంతా దిగిపోయింది. వలవలా ఏడ్చాడు. "మా కసం ... నాకేమీ తెలీదు" అన్నాడు. ఫాతిమా నమ్మలేదు. "అల్లా కసం. సారా కొట్టు నుంచి నేరుగా వస్తున్నా" అన్నాడు. "పద. వెళ్ళి వెదుకుదాం" అంటూ తాగిన మత్తు ఎక్కువై దబ్బున పడిపోయాడు.

రాత్రి ఎనిమిది దాటింది. కొంత మంది ముస్లిం కుర్రవాళ్ళు టార్చిలైట్లు పట్టుకుని, ఫాతిమాతో పాటు వెతకడానికి బయల్దేరారు. రాత్రి పదకొండు వరకూ వెదికినా జాడ తెలీలేదు. ఫాతిమాకి రాత్రంతా నిద్ర పట్టలేదు. ఏడ్చి ఏడ్చి కళ్ళు ఎండిపోయాయి. తనకు పుట్టిన ఆడ సంతానంలో పెద్దదాని బతుకు అలా తెల్లారినందుకు, చిన్న దాని బతుకు ఏమైందో తెలీనందుకు ఆమెకు విపరీతమైన దుఃఖం కలిగింది.

పెద్దపిల్ల రజియాకి పదమూడో యేడు రాగానే నిఖా చేశారు. తాపీ పని చేసే ఖాజాకి కట్నం కింద ఐదు వేలు రొక్కం, ఓ సైకిలూ కొనిస్తామని మాటిచ్చాడు ఫకీర్. నిఖా రోజు సైకిల్తో పాటు రెండు వేలు చేతిలో పెట్టి, మిగతాది అప్పుకింద నెలకింతని తీరుస్తానని మాటిచ్చాడు. నెలకిస్తీలు తీర్చే విషయంలో మాట నిలుపుకోలేక పోయాడు. అల్లుడు రజియాకి నరకం చూపించడం మొదలెట్టాడు.

ఓ రోజు తన్ని పుట్టింటికి తరిమేశాడు. కట్నం బాకీ తెస్తేనే యింట్లో అడుగు పెట్టమన్నాడు. రజియా ఏడుపు చూడలేక ఫాతిమానే పదిమంది దగ్గర చేబదుళ్ళు తీసుకుని ఐదొందలు జమ చేసి అల్లుడి కాళ్ళు పట్టుకుని సర్ది చెప్పి, కూతుర్ని వదిలేసి వచ్చింది. అలా వదిలి వచ్చిన రెణ్ణెల్లకే అల్లుడి దగ్గర నుంచి కబురొచ్చింది 'స్టౌ అంటుకుని రజియా కాలిపోయింద'ని. నెత్తీనోరూ బాదుకుంటూ ఆ వూరు వెళ్ళేటప్పటికే రజియా చచ్చిపోయింది.

"చచ్చేదేదో పెళ్ళికి ముందే చచ్చుంటే నాకీ ఖర్చు, అప్పులూ తగ్గి ఉండేవిగా. ముదనష్టంది. నా కొంప ముంచి మరీ పోయింది" అంటూ తిట్టుకున్నాడు ఫకీర్.

'అల్లా... నాకసలు ఆడపిల్లల్ని ఎందుకిచ్చావ్?' అంటూ రోదించింది ఫాతిమా. 'కనీసం నాచిట్టి తల్లి నాజియానైనా నాకు దక్కించు. చచ్చిపోయే క్షణం వరకూ నీ ప్రార్థనలోనే గడుపుతాను' అంటూ దువా చేసింది.

ఉదయం ఆరు కాకముందే చెరువు గట్టున నాజియా శవమై పడి ఉందన్న వార్త వూరి నిండా గుప్పుమంది. ఆ పిల్ల శవాన్ని చూడటానికొచ్చిన మనుషుల్లో కొంతమంది, నిన్న సాయంత్రం సునీల్‌తో పాటు ఆ పిల్ల చెరువు వైపుకెళ్ళటం చూసినట్లు చెప్పారు.

సునీల్ భయంతో యింట్లోనే దాక్కున్నాడు. వాడి నాన్న రాఘవులు చర్మం వూడొచ్చేలా కొట్టాక నిజం చెప్పాడు... ఆ పిల్లని చెరిచి చెరువులో ముంచి చంపేసిన వైనం...

రాఘవులు చాలా వేగంగా ఆలోచించాడు. పోలీసులకి తెలిస్తే తన కొడుక్కి ఉరి ఖాయం. జరిగిన విషయం ఎంత ఘోరమైందో, ఎంత హేయమైందో తెల్సినా, తండ్రిగా తన కొడుకుని కాపాడుకోవటమే ముఖ్యమనిపించిందతనికి. హుటాహుటిన గ్రామ సర్పంచ్ నర్సింహులు దగ్గరకి పరుగెత్తాడు. 'పాహిమాం రక్షమాం' అన్నాడు. 'నువ్వూ నేను ఒకే కులం' అని గుర్తు చేశాడు. వూళ్ళో మన

కులపోళ్ళదే మెజారిటీ ఐనప్పుడు మైనారిటీ వర్గం కోసం పాకులాడటం విజ్ఞత కాదని నూరిపోశాడు. తన శక్తి కొద్దీ చేయి తడుపుతానన్నాడు. 'ఈ గండం నుంచి గట్టెక్కిస్తే కాళ్ళు కడిగి నీళ్ళు నెత్తిమీద చల్లుకుంటా'నన్నాడు.

నర్సింహులు పంచాయతీ పెట్టాడు. అతనికి ఫకీర్ బలహీనతేమిటో తెల్సు. దాన్ని ఆసరా చేసుకుని పావులు కదపాలనుకున్నాడు. ముస్లిం పెద్దల్ని పిలిపించాడు. వాళ్ళెదురుగా సునీల్‌ని బాగా కొట్టమని రాఘవులుకి ముందే చెప్పి పెట్టాడు.

పంచాయతీకి ఫకీర్‌తో బాటు ఫాతిమా కూడా చద్దర్ కప్పుకుని వచ్చింది.

పంచాయతీ మొదలైంది. సునీల్ తన వల్ల తప్పు జరిగిందని చెప్పగానే రాఘవులు ఉద్రేకంగా లేచి సునీల్‌ని కింద పడేసి కాళ్ళతో కొట్టడం మొదలెట్టాడు.

నర్సింహులు అడ్డు పడ్డాడు. "పిల్లాణ్ని చంపేస్తావా ఏమిటి? వాడు చేసింది తప్పే. కాదని ఎవ్వరూ అనటం లేదు. కాని దానికి శిక్ష వాడి ప్రాణాలు తీయటం కాదు. అందువల్ల చనిపోయిన పిల్ల బతికి రాదుగా" అన్నాడు.

ముస్లిం పెద్దల్ని ఉద్దేశించి "యిది మన వూరి వ్యవహారం. పోలీసుల్ని పిలవటం వల్ల నష్టమే తప్ప లాభం ఏవుంటుంది చెప్పండి? మధ్యలో వాళ్ళు బాగు పడ్తారు. మనల్ని సతాయించి, వంద సార్లు స్టేషన్ చుట్టూ తిప్పుకుని, రెండు వైపులా దండుకుంటారు. ఫకీర్ పేదోడని మీకూ తెల్సు నాకూ తెల్సు. అందరికీ సమ్మతమయ్యేలా మనం సమస్యని పరిష్కరించుకుందాం. ఏమంటారు" అన్నాడు.

ముస్లిం పెద్దలు మంతనాలాడుకున్నారు. ఫకీర్‌తో "నీ ఉద్దేశం ఏమిటి?" అని అడిగారు. "పోయిన పిల్ల ఎలాగూ పోయింది. రాఘవులు నష్టపరిహారంగా డబ్బులివ్వడానికి రెడీగా ఉన్నాడు. ఇవ్వాళ రేపు గవర్నమెంటోళ్ళు కూడా ఇలానే చేస్తున్నారని నీకు తెల్సుగా. బాంబులు పేలో, రైళ్ళు పడిపోయో ఎవరైనా చచ్చిపోతే నష్టపరిహారం కింద డబ్బులిస్తున్నారు. ఐనా నీ యిష్టం. కాదూ

పోలీసులదాకా వెళ్దామంటావా నీకు తోడు మేమున్నాం" అన్నారు.

"నాకు డబ్బులిప్పించండి. అప్పులు తీర్చుకుంటాను" అన్నాడు ఫకీర్.

"నా ప్రాణం పోయినా నేనొప్పుకోను. వాడికి ఉరిశిక్ష పడాల్సిందే" అంది ఫాతిమా.

"ముస్లిం పెద్దల ముందు ఆడదానివి నువ్వు మాట్లాడకూడదు. మగవాళ్ళం మేము నిర్ణయిస్తాం కదా" అన్నాడు వాళ్ళలో ఒక ముసలాయన.

"దాన్ని కన్నది నేను... నాది కడుపుకోత... నాగుండెని రంపంతో కోశాడు వాడు" ఆక్రోశించింది ఫాతిమా.

"నోర్మూసుకుని పడుండు. లేదా గొంతు పిసికి చంపేస్తాను" హుకుం జారీ చేశాడు ఫకీర్.

చివరికి నష్టపరిహారం అడగడానికే నిర్ణయం జరిగింది.

'నా చిట్టి తల్లి ప్రాణాలకి పరిహారమా... ఎన్ని లక్షలు కుమ్మరించినా నా తల్లిని తెచ్చివ్వగలరా వీళ్ళు? ప్రాణానికి ప్రాణమే పరిహారం... వాడిని నడిబజార్లో ఉరి తీసినా పాపం లేదు. అటువంటి మృగాన్ని వదలకూడదు. యిది అడవి కాదుగా... సభ్య సమాజం కదా... డబ్బుల్తో పాపాన్ని కడిగేసుకునే చర్య అనాగరికం... అమానుషం....' ఫాతిమా హృదయం మూగగా రోదిస్తోంది.

"జరిగిన నష్టానికి వెయ్యి రూపాయలైతే యిచ్చుకోగలను" అన్నాడు రాఘవులు. ఒకేసారి పెద్ద మొత్తం చెప్పవద్దని నర్సింహులు ముందే హెచ్చరించి ఉన్నాడు.

"చాలా తక్కువ... ఐదు వేలు లేందే గిట్టుబాటు కాదు" అన్నారు ముస్లిం పెద్దలు.

'ఒరేయ్ అది నా కూతురి ప్రాణంరా... దేన్ని ఎవరికి అమ్ముతున్నార్రా మీరు... ఏది ఎవరికి గిట్టుబాటు కాదురా? మీ కూతుర్లనో పెళ్ళాలనో పాడుచేసి

చెరువులో ముంచేసి చంపేస్తే అప్పుడు తెలుస్తుందిరా ఆ బాధేమిటో...' ఫాతిమా గుండె కన్నీళ్ళు కారుస్తోంది.

"సరే. ఫకీర్ పేదోడు. నాకిబ్బందైనా ఈ యేడు పంటలో ఆ నష్టాన్ని పూడ్చుకోగల్ను. చివరాఖరిగా చెప్తున్నా. రెండు వేలిస్తా. అంతకు మించి పైసా యివ్వలేను. కాదంటారా మీయిష్టం. ఈ డబ్బే పోలీసులకిచ్చి నా తంటాలేవో నేను పడ్తా" అన్నాడు.

ముస్లిం పెద్దలు నర్సింహులు వైపు చూసి "మీరే న్యాయం చెప్పాలి" అన్నారు.

బిచ్చగాడిలా వంగి వంగి రాఘవులు కాళ్ళకు, నర్సింహులు కాళ్ళకు దండాలు పెడ్తున్న ఫకీర్‌ని చూసి 'ఛీ... నువ్వూ ఓ తండ్రివేనా... ఓ అబ్బకూ అమ్మకూ పుట్టినోడివైతే నీ కూతుర్ని చంపినోడి దగ్గర బిచ్చమెత్తుకుంటావా... నామర్ద్' అనుకుంది ఫాతిమా. అసహ్యంతో తుపుక్కున పక్కనూసింది.

యిరువర్గాల వాదనలు విన్న తర్వాత నర్సింహులు తన జడ్జిమెంట్ విన్పించాడు.

"మధ్యే మార్గంగా మూడు వేలకి సెటిల్ చేద్దాం. యిరవై నాలుగు గంటల్లోపల ఆ డబ్బు ఫకీర్ చేతికందాలి. పోలీసులకి సమాచారం అందివ్వకూడదు. ఎవరైనా అడిగినా డెంగ్యూ జ్వరం వచ్చి పిల్ల చచ్చిపోయిందని చెప్పాలి. ఈ రోజునుంచి ఎవ్వరూ సునీల్ చేసిన పని గురించి మాట్లాడకూడదు. మర్చిపోవాలి. యిది మన వూరి పరువు మర్యాదలకు సంబంధించిన విషయం" అన్నాడు.

ఫాతిమాకి విపరీతమైన కోపం వస్తోంది. కానీ అసహాయత... ఎవరిమీదా చూపించడానికి వీల్లేని పరిస్థితి... 'ఈ వూరికి మీకూ పరువూ మర్యాదలేమిట్రా... యిది ఈ వూరిలోని కుళ్ళుకు, మీ కుట్రకు సంబంధించిన విషయం... ఆ గబ్బు దాచి పెట్టమని చెప్పు... మీవి గుండెలు కాదు బండరాళ్ళన్న విషయం పదిమందికీ తెలియకూడదని చెప్పు...' ఫాతిమా పళ్ళు కొరికింది. 'ఛీ ఆడజన్మ...

కుక్క కన్నా హీనమైన బతుకు... అదైనా నయం... కోపం వస్తే మొరగడానికైనా స్వేచ్ఛ ఉంది. ఆడదానికి, అందునా ముస్లిం ఆడదానికి ఆపాటి స్వేచ్ఛ కూడా లేదు' అనుకుంది.

★ ★ ★

ముస్లిం యువకులు కొంత మందికి పెద్దలు కుదిర్చిన రాజీ వ్యవహారం నచ్చలేదు. అలాగని వాళ్ళకు ఎదురు తిరిగే గుండె ధైర్యమూ లేదు. అందుకే అటు వైపు నుంచి నరుక్కొద్దామనుకుని పోలీసులకి సమాచారం అందించారు.

ఎంక్వయిరీకి సబ్ యిన్‌స్పెక్టర్ వీరాస్వామి యిద్దరు కానిస్టేబుళ్ళని తీసుకుని ఆ వూరికొచ్చాడు. వూళ్ళో ఎవర్నడిగినా డెంగ్యూ జ్వరమొచ్చి చచ్చిపోయిందనే చెప్తున్నారు. కాని వాళ్ళ మొహాలు చూడగానే అర్థమౌతోంది నిజాల్ని దాస్తున్నారని.

వీరాస్వామి ఫకీర్ వాళ్ళింటికొచ్చాడు. "నిజం చెప్పండి. మీకేం భయం లేదు. ఈ వూరి సర్పంచ్‌గాని, మరెవరైనా గాని మిమ్మల్నేమీ చేయరు. మేము రక్షణ కల్పిస్తాం. మీ అమ్మాయి ఎలా చనిపోయింది? ఎవరో చంపి చెరువులో పడేశారట కదా. ఎవరు వాళ్ళు" కొద్దిగా గదమాయిస్తూ అడిగాడు.

ఫకీర్ భయపడ్తూనే నంగి నంగిగా "డెంగూ జొరమొచ్చి సచ్చిపోయింది సాబ్. చిన్నపిల్ల కదా... పేదోణ్ని...మందులిప్పించలేకపోయాను." అన్నాడు.

"నీ భార్యని పిలువ్... మాట్లాడాలి" అన్నాడు.

"మా ఆడోళ్ళకేం తెలీదు సాబ్... మీలాంటోళ్ళ ముందుకు రావాలంటే భయపడ్తుంది సాబ్" అన్నాడు.

వీరాస్వామి ఏదో అనేలోపలే ఫాతిమా విసురుగా బైటికొచ్చింది. ఫకీర్ కంగారుగా "నువ్వెందుకొచ్చావ్? పో లోపలికి" అన్నాడు కోపంగా.

"నీకేం పర్లేదు. చెప్పమ్మా... మీ అమ్మాయి ఎలా చనిపోయింది" అని అడిగాడు

వీరాస్వామి.

"నోరెత్తావా తలాక్ యిచ్చేస్తాను. ఫో లోపలికి" అరిచాడు ఫకీర్.

"నువ్వేంట్రా తలాక్ యిచ్చేది... నేనే నీకు ఖులా చెప్తున్నా... నువ్వు నా కాళ్ళు పట్టుకున్నా నీలాంటి నీచుడితో కాపురం చేయడానికి తయారుగా లేను" అంది ఫాతిమా. ఆమె చూపుల్లోని అనంతమైన అసహ్యానికి శక్తుంటూ ఉంటే ఫకీర్ మాడి బూడిదైపోయి ఉండేవాడు. నిజాల్ని చెప్పడానికి సమస్త శక్తుల్ని కూడగట్టుకుని ఫాతిమా సబ్ యిన్‌స్పెక్టర్ వైపు తిరిగింది.

*(ప్రస్థానం ప్రత్యేక సంచిక, నవంబర్ & డిసెంబర్ 2006)*

★ ★ ★